## కె. ఇందిర

"రాధక్కా. ఆకలేస్తోంది. ఏదైనా తింటానికి పెట్టవూ" దీనంగా అడుగుతున్న చిన్న తమ్ముడు గోపికి ఏమి జవాబివ్వాలో ఆలోచిస్తోంది రాధ. ఆకలి బాధకు తట్టుకోలేక కడుపులో కాళ్ళు పెట్టుకుని నిద్రపోతున్నారు చెల్లి, తమ్ముళ్ళు. వీళ్ళే కాదు ఆ పెద్ద ఊడల మర్రిచెట్టు నీడలోని చాలా ప్రాణాలు అదేస్థితిలో వున్నాయి. అది నిద్రో లేక శోషో అర్థం కాలేదు రాధకి. వీళ్ళందరికీ ఏ సహాయమూ చెయ్యలేక రాముడికి దండం పెట్టి శిలలా మారిపోయాడు దాసాంజనేయులు— ఆ చెట్టు మొదట్లో.

"అక్కా...ఎదురుగా వున్న మేడ మీద వాళ్ళందరూ ఏమంటున్నారక్కా ఎంతో సేపటినుంచి?" నోరు చప్పరించుకుంటూ అడిగాడు గోపి.

ఎదురుగా వుంది కంట్రాక్టర్ విష్ణుమూర్తి కట్టించిన మూడు అంతస్తుల మేడ. టెర్రస్ మీద వెన్నెల భోజనాలు చేస్తున్నారు ధనవంతులు, నాయకులు, పెద్ద ఉద్యోగస్తులు.

"అమ్మా రాధా, వాళ్ళింట్లో పెళ్ళి విందా జరుగుతోంది? గొప్ప వాళ్ళందరూ కార్ల మీద స్కూటర్ల మీద వచ్చారు?" నస్యం డబ్బీని బొడ్డులో దోపుకుంటూ అడిగాడు తాతయ్య.

"గొప్పవాళ్ళకి పెళ్ళిళ్ళు, పుట్టిన రోజులు, తద్దినాలు రానక్ఖర్లేదు తాతయ్యా. వాళ్ళకి రోజూ ఒక విందే. ఎండిన రొట్టెముక్క దొరక్క మనం ఏడుస్తుంటే తిన్నంత తిని, పారేసినంత పారేస్తారు. వాళ్ళకేం కడుపునిండిన బేరాలు." కసిగా అంది రాధ మేడపైకి చూస్తూ. ఆకాశంలో హాయిగా ఎగురుతున్న చకోరాలను చూసిందిరాధ.

"తాతయ్యా మనం ఆ చకోరాలుగా మారితే హాయిగా ఆకాశంలో ఎగురుతూ వెన్నెలను తింటూ సుఖంగా బ్రతికే వాళ్ళము కదా తాతయ్యా?"

"అవును తల్లీ. ఈ నిరుపేద జన్మకంటే ఏ పక్షిగానో ఏ చెట్టుగానో పుట్టివుంటే బాగుండేది. వీళ్ళను చూస్తూంటే కడుపు తరుక్కుపోతోందే రాధా! రాముడు, కోడలు బ్రతికుంటే మనకీ దుస్థితి పట్టదే నా తల్లీ" చనిపోయిన కొడుకును కోడల్ని తలచుకొని కన్నీళ్ళు తుడుచుకున్నాడు తాతయ్య.

మేడకి ప్రక్కగా వున్న చెత్తకుండీ వైపు చూశాడు గోపి. ఆ చెత్త కుండీ ఎంగిలాకులతో ఎప్పుడు నిండుతుందా అని ఆశగా చూస్తున్నాయి వూర కుక్కలు. ఆ కుక్కలను తోలుతూ కొంత మంది బిచ్చగాళ్ళు కాచుకుని కూర్చున్నారు ఎంగిలాకులకోసం.

"అక్కా. నేను వెళ్ళి రెండు ఎంగిలి విస్తళ్ళను ఎత్తుకుని వచ్చేదా?" ఆత్రంగా అడిగిన గోపిని అక్కున చేర్చుకుంది రాధ బాధతో.

"గోపీ! ఇంత పుట్టుక పుట్టి, అందరి ఎంగిళ్ళు తింటానంటావురా. వాళ్ళు తినగా పారేసిన కోడి కొక్కురాయి ఎముకలను తింటావురా గోపీ. ఆకలితో మాడైనా చద్దాము కాని మనకి ఆ ఎంగిళ్ల తినే బ్రతుకు అక్కర్లేదురా."

చెత్త కుండీ దగ్గర కాచుకుని కూర్చుని వున్న ఎన్నో జతల కళ్లు మేడపైకి ఆశగా చూస్తున్నాయి విందు ఎప్పుడవుతుందా! ఎంగిలి విస్తళ్ళతో తమ కడుపులు ఎప్పుడు నిండుతాయా అని. వాళ్ళని చూసి పిచ్చిగా నవ్వింది రాధ.

"అటు చూడు తాతయ్యా! పాపం పిచ్చి బిచ్చగాళ్లు, ఎంగిలి విస్తర్లకోసం ఆశగా చూస్తున్నారు. గొప్పవాళ్ల విస్తర్లల్లో భోజనం చెయ్యరు— గాజుప్లేట్లలో తింటారని తెలియదుపాపం ఈ బిచ్చగాళ్ళకి. ఆ మిగిలిన ఎంగిలిని తినేందుకు వాళ్ళ క్రింద పనిచేసే కుక్కలు చాలా వున్నాయి. వీళ్ళకేం మిగులుతుంది మట్టి?" పిచ్చిగా నవ్వుతూ మాట్లాడుతున్న రాధను చూసి ఉలిక్కి పడ్డాడు తాతయ్య. "అమ్మా రాధమ్మా ఎందుకు తల్లీ, అలా నవ్వుతున్నావు?"

"ఏమీలేదు తాతయ్యా! కడుపులు నిండిన వినాయకులే చేరి కడుపులు నింపుకుంటారే కాని వాళ్ళకంటే కొంచెం తక్కువ వాళ్ళకి పెట్టరు. కటిక పేదవాళ్ళకి ఒక పట్టెడు మెతుకులు రాల్చరు. డబ్బెక్కువయి విందులు చేసుకుంటున్నారు వాళ్ళు. పైసా లేక ఆకలితో 'అన్నమో రామచంద్రా' అంటున్నాము. ఎందుకిలా జరగాలి తాతయ్యా దేవుడున్నాడా అసలు?" బాధతోటీ, ఉక్రోషంతోటి, అడిగింది రాధ.

"యుగాలనుంచి జరిగే తంతే ఇది తల్లీ. వున్నవాడికే పెడతాడు పై మెట్టులో ఉన్నవాడు. తనకంటే ఒక మెట్టు దిగువలో వున్న వాడ్ని పిలవడు తల్లీ. అది వాళ్ళ గౌరవానికే భంగం. అలాంటిది పాతాళంలోకి దిగజారిపోతున్న మనల్ని పిలిచి పెడతారటే తల్లీ. పిచ్చిరాధమ్మా ఇంకేమీ ఆలోచించక పడుకో—ప్రొద్దుగూకులూ తెగతిరిగావు కూలి డబ్బులకోసం" ఒక చిటికెడు నస్యం పట్టించి చిగురుల బొంతమీద నడుం వాల్చాడు తాతయ్య.

మేడమీద నుంచి పెద్దగా వీనులకు విందుగా పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది. "చీర్స్" అనుకుంటూ బ్రాందీని, విస్కీని గ్లాసుల్లోనింపుకుని ఆడ మగా తేడాలేకుండా త్రాగుతున్నారు. ఆ మైకంలో భార్యనే, భర్తనే భేదం తెలియక ప్రక్కనున్న చేతులను పట్టుకుని ఆ సంగీతానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. అరగంటసేపు భూలోకస్వర్గంలా ఊహించుకున్నారు అక్కడివాళ్ళు. తరువాత అలసటతో కుర్చీల్లో కూలబడ్డారు. ఆ అలసిన ప్రాణాలకి అందించారు ఫ్రూట్‌సాలడ్‌లు, ఐస్‌క్రీములు. అవి తింటూ ఆడవాళ్ళందరూ కబుర్లు చెప్పుకోసాగారు.

"మిసస్ మూర్తీ! మీ డిన్నర్ బ్రహ్మాండంగా వుంది. ముఖ్యంగా మీ ఆవకాయ చాలా బాగుంది."

"నిజంగానా! మీ ఇంటికి పంపుతాను ఎంత కావాలంటే అంత. బైదిబై మీరు కట్టుకున్న చీర చాలా బాగుంది. ఎక్కడకొన్నారేమిటి?"

"ఇది మిష్టర్ రాయుడు జపాన్ నుంచి తెప్పించారు. ఖరీదేమంత లేదు. ఒన్లీ ఫోర్ హండ్రెడ్. మీకు కావాలంటే ఇంకో చీర వుంది. ఇస్తాను."

"ఓ. చాలా థ్యాంక్స్. బైదిబై మిసస్ వర్మా! దీపావళికి చీర తీసుకున్నారా?"

"బెనారస్ చీర తీసుకున్నాను. ఎనిమిది వందలు. లేడీస్ అండ్ జెంటిల్‌మన్! ఒక చిన్న విన్నపం. వచ్చే ఆదివారం మా ఇంట్లో జరగబోయే ట్యూబ్‌లైట్ డిన్నర్‌కి మీ అందరు వచ్చి మమ్మల్ని ఆనందింపచేయవలసిందిగా ప్రార్థన."

"అరెరే! నేను పిలుద్దామనుకున్నాను డిన్నర్‌కి. కాని మీరే ఛాన్స్ కొట్టేశారు. ఫరవాలేదు దీపావళి నాడు మా ఇంట్లో జరిగే విందుకు రావలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను." మిసస్ రాయుడు చెప్పగానే అందరూ హియర్, హియర్ అంటూ వండర్‌ఫుల్ అంటూ కరతాళధ్వనులు చేసారు. అందరూ నవ్వుకుంటూ తూలుకుంటూ క్రిందకి వచ్చారు.

ఎవరైనా ఒక పదిపైసలు చేతిలో పడెయ్యక పోతారా అని నుంచున్న గోపికి–కార్లు, స్కూటర్లు తన కలల్లోకి కూడా రాని దూరపు కొండల్లాగా కనిపించాయి. వాటివైపు వింతగా చూస్తున్నాడు. అందరూ తమ తమ వాహనాల్లో కుర్చొని స్టార్ట్ చేశారు. వేటికీ హెడ్‌లైట్లు వెలగలేదు. అన్నీ పగలగొట్టి వున్నాయి. కోపంతో చుట్టుప్రక్కల, ఈ పనిని చేసినదెవరా అని చూస్తున్నవాళ్ళకి అమాయకంగా చూస్తున్న గోపి కనిపించాడు.

"రాస్కెల్! లైట్లన్నీ పగలగొట్టి వినోదం చూస్తూ నుంచున్నావా!" గోపి చెంప ఛెళ్ళు మనిపించారు ఎవరో.

"నేను పగలగొట్టలేదు. ఆంజనేయస్వామి సాక్షిగా పగలగొట్టలేదు." ఏడుస్తూ చెపుతున్న గోపి మరో చెంప ఛెళ్ళుమంది.

గోపి ఏడుపు విని పరుగెత్తుకుంటూ వచ్చారు రాధ, నీల. చిరుగులపాతలు ఆ చిక్కని శరీరాల అందాల్ని కప్పలేకపోతున్నాయి. వెన్నెల్లో మలచిన పాలరాతి విగ్రహాల్లా మెరిసిపోతున్నారు వాళ్ళిద్దరూ.

"ఎవరో చేసిన పనికి మా తమ్ముడ్ని కొట్టడానికి మీకు చేతులు ఎలా వచ్చాయి? ధనం, విద్య వుంటేనే చాలదు. మానవత్వం వుండాలి. అప్పుడే మనిషనిపించుకుంటాడు." కోపంతో మాట్లాడుతున్న రాధ అందమైన అదిరే పెదవులను చూసి పెదవులను తడుపుకున్నాడు కంట్రాక్టర్ విష్ణుమూర్తి. వాళ్ళ అందాన్ని ఆస్వాదించే మగవాళ్ళను చూసింది మిసస్ మూర్తి.

"ఆడపిల్లలా మీరు గాడిదలా? కొంచెం ఒంటి నిండా బట్ట వుండాలని తెలియదా? బైదిబై ఇలా మగవాళ్ళ ముందు రావడానికి సిగ్గుల్లేవూ మీకు?"

"అయ్యోపాపం, మీకు కావలసినంత నల్ల ధనం వుంది. వందలకొలదీ చీరలున్నాయి. అలాంటి మీరే చాలీచాలని బట్టలతో శరీరాల్ని కప్పుకోలేక అవస్థపడుతున్నారు. ఇక మాలాంటి వాళ్ళ సంగతి ఏమంటారు? పాపం తోటి ఆడదాని



దుస్థితికి అంత జాలి గలిగితే బైదిబై రెండు చీరలు మా ముఖాన పడెయ్యకూడదూ?" వ్యంగ్యంగా అంది రాధ వాళ్ళ వస్త్రధారణను పరికిస్తూ. అక్కడున్న ఆడవాళ్ళందరూ తమ వంక చూసుకున్నారు. అందరూ స్లీవ్‌లెస్, లో-కట్ జాకెట్లు వేసుకున్నారు. బొడ్డుక్రిందకి వుండాలా, వూడాలా అన్నట్లు కట్టుకున్న చీరలు, భుజం మీద వుండటం ఇష్టంలేక క్రిందపడే పమిట కొంగులు—ఈ తీరులో వున్నారు వాళ్ళందరూ. ఆ లావుపాటి శరీరాల ముందు రాధ, నీలలు రెండు లతల్లాగా వున్నారు.

"మూర్తీ! పిల్లలు బలే జోరుగా వున్నాయి. పంజరంలో వుంచి మంచి తిండి పెడితే మజాకు బలేగా పనికివస్తాయి." వర్మ మాటలను ఒక జోక్‌గా భావించి అందరూ గొల్లుమని నవ్వసాగారు. కోపంతో వూగిపోయింది రాధ.

"మిష్టర్. డోంట్ టాక్ రబ్బిష్. మీకు పనికి వచ్చే బంగారు చిలుకలు ఇన్ని వుండగా మర్రి నీడలో బ్రతికే మాలాంటి పిచ్చుకలు మీకెందుకు? గోపి, నీలా పదండర్రా. వీళ్ళదగ్గర నుంచుంటే లేనిపోని పాపాలు మనకంటుకుంటాయి." చీత్కారంగా వాళ్ళని చూసి రాధ వెళ్ళింది చెట్టు నీడకి.

కోపంతో మూర్తి మర్రిచెట్టును భస్మం చేసేటట్లు చూసాడు. రాధ చేత తను పొందిన అవమానం గుర్తుకువచ్చి చెంప తడుముకున్నాడు మూర్తి. ఈ మర్రి నీడను చూసుకునేగా వీళ్ళకింత పొగరు. ఈ నీడ లేకుంటే తమ నీడలోకి రాకుండా వుంటాయా పిచుకలు? వర్మ ఒక క్షణం ఆలోచించాడు.

"మిష్టర్ మూర్తీ! మీ అందమైన భవనం ముందు ఈ దెయ్యాల మర్రి ఎందుకయ్యా? ఆ ప్లేస్‌లో ఒక పెద్ద హోటల్ కట్టిస్తాను." గర్వంగా అందరివంకా చూస్తూ కారును స్టార్ట్ చేసాడు వర్మ. చెట్టు క్రింద వుండి ఆ కార్లవంక చీరలవంకా ఆశగా చూస్తున్న నీల కళ్ళు వర్మ మనసును ఆకట్టుకున్నాయి.

"అక్కా! మూర్తిగారి భార్యకి అన్ని చీరలున్నాయి కదా పాతబడ్డ చీరలన్నిటినీ ఏం చేస్తారక్కా?" అమాయకంగా అడిగిన నీలను చూసి నవ్వింది రాధ.

"పిచ్చి నీలా! పాత చీరలన్నిటినీ స్టీలు సామాన్లవాడికి, ప్లాస్టిక్ సామాన్లవాడికి ఇస్తారే వీళ్ళు. పొరపాటునైనా మనలాంటి వాళ్ళకి పాత బట్టలిస్తే వచ్చే పుణ్యాన్ని దాచుకునేందుకు లాకర్లు లేవు వాళ్ళదగ్గర. అందుకని భయం వాళ్ళకి."

"అక్కా అందమైన చీరలు, భవనాలు, కార్లు విందులు, వినోదాలు మన జన్మలో చూస్తామా అక్కా?"

"కలలో కూడా చూడలేము నీలా మనం. పిచ్చి ఆలోచనలు పెట్టుకోక నిద్రపో. ఓరేయ్ గోపి నువ్వు పడుకోరా!"

గతం జ్ఞప్తికి వచ్చిన రాధకు నిద్రరాలేదు. తండ్రి ఎలిమెంటరీ స్కూలు టీచర్. అయిదుగురు పిల్లలు. ఎస్. ఎస్. ఎల్. సి. చదివిన రాధ, టెన్త్ పాస్ అయిన నీల గుండెల మీద కుంపట్లుగా వున్నారు. రెండేళ్ళ క్రితం శివరాత్రి నాడు కృష్ణస్నానానికి వెళ్ళిన తల్లితండ్రులిద్దరూ కృష్ణలో మునిగిపోయి అన్ని బంధాలను తెంచుకుని శివుని చేరుకున్నారు. దెబ్బయో పడిలో పడిన తాతయ్య మీద పడింది భారం. ఇంటి అద్దె చెల్లించనందున ఇంటి వాళ్ళు బయటకు గెంటారు ఏడాది క్రితం. తాతయ్య అర్చన చేసే ఆంజనేయస్వామికి గుడిగా వున్న మర్రి చెట్టు వీళ్ళకి నీడగా మారింది. ఆ పచ్చని


క్రొత్తది!

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్టమైన

అముదము

శుద్ధిచేసినది.
వాసనలేనిది.




మూడు సైజులలో లభిస్తుంది:
50 మిలి
100 మిలి
200 మిలి

అమృతాంజన్ అముదము

OBM 3270 5 TG(R)

చెట్టు నీడలో రెండు చింకి చాపలు అడ్డుగా పెట్టుకుని కాలక్షేపం చేస్తున్నారు. రాధ మిషన్ మీద బట్టలు కుట్టి అక్కడక్కడా వంటలు చేస్తూ, కూలీకి పోతూ సంపాదిస్తోంది. రాధ అందం ఆమెకు శత్రువయింది. మిషన్ పని కూడా పోయింది. పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో పసి నిమ్మపండులాగా వున్న నీలను ఎక్కడికీ పంపడం ఇష్టం లేదు రాధకి. ఆకాశానికి అంటుకునే ధరల తోటి వీళ్ళ సంపాదన పోటీ పడలేక పాతాళంలోకి దిగజారిపోయింది. పస్తులు మిగిలాయి వీళ్ళకి. ఏ భక్తుడో దయవుంచి వేసిన దక్షిణ మిగిలింది వీళ్లు కొనుక్కునే ఎండిన బ్రెడ్‌కి. నాలుగు తాటాకులు తెచ్చి గుడిసె వేసుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తుండగా, కంట్రాక్టర్ విష్ణుమూర్తి మూడు అంతస్థుల మేడను మూడు నెలలలో కట్టించాడు. "ధనం మూలం మిదం జగత్" అనుకుంది రాధ. కన్నె ప్రాయంలో కలలు గన్న రాధ ఆ కలల జ్ఞాపకాల్ని వెతుక్కుంటూ నిద్రలోకి జారుకుంది.

తెల్లవారుతోంది. తాతయ్య పాడుతున్న సుప్రభాతం వింటూ లేచింది రాధ. మర్రి నాశ్రయించిన వందల కొలదీ పక్షిగణాలు కిల కిల, కల కల రవాలతో సుప్రభాతం పలికాయి. రెక్కలు విదిల్చి తమ గూళ్ళు వదలి హాయిగా ఆకాశం లోకి ఎగిరిపోసాగాయి తమ తిండిని అన్వేషిస్తూ. రాధ లేచి కాలకృత్యాలు తీర్చుకుని ఎండిపోయిన రొట్టెలు చౌకగా దొరుకుతాయని తొందరగా నడక సాగించింది టౌన్ లోకి.

ఒక స్కూలు దగ్గిర చాలామంది స్త్రీలు బారులు తీర్చినుంచున్నారు. అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా దీపావళికి పేద మహిళలకు ఉచితంగా చీర జాకెట్, ధోవతుల చాపు ఇస్తున్నారట మహిళా మండలి వారు. అయిదు వేల మందికి ఇస్తారట. రాధకి చెప్పలేని సంతోష మేసింది. వెళ్ళి క్యూలో నుంచుంది. దాదాపు ఏడు, ఎనిమిది వేల మంది ఆడవాళ్ళు క్యూల్లో నుంచుని వున్నారు. అందరి ముఖాల్లో ఏదో తెలియని సంతోషం, పండక్కి కొత్త చీర కట్టుకుంటామే అనే తృప్తి కనిపిస్తోంది. రాధ హమ్మయ్య అనుకుంది. నీలకి, తనకి రెండు ఓణీలు అవుతాయి. కాస్త ఒళ్ళు దాచుకోవచ్చును. తాతయ్యకి క్రొత్త ధోవతులు వస్తాయి. చలికి కప్పుకోవచ్చు. పాపం తాతయ్య చలికి వణికిపోతుంటాడు. సంతోషంతో కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయి రాధకు. ప్రొద్దున్న ఎనిమిది గంటలకు క్యూలో నుంచున్న రాధ సాయంత్రం నాలుగు గంటలకు గమ్యం చేరుకుంది. చీరలు పంచుతున్న మిసెస్ మూర్తి రాధను చూసి వ్యంగ్యంగా నవ్వింది.

"అరే, నువ్వూ వచ్చావా? బైదిబై నీకూ కావల్సి వచ్చిందా చీరె?"

"రాబందుల చూపుల బారినుండి శరీరాన్ని కప్పేందుకు కావాలిగా ఏదో చీరె! పట్టు చీరలు, దేవతా వస్త్రాలు లేకపోయినా!" సమాధానం చెపుతూ చిన్నగా నవ్వింది రాధ మిసెస్ మూర్తి కట్టుకున్న దేవతా వస్త్రాన్ని చూస్తూ.

ప్రక్కనే కూర్చుని వున్న పంజాబీ ఆవిడతో హిందీలో మాట్లాడుతూ చెప్పింది మిసెస్. మూర్తి. రోటీ నహీ, కపడా నహీ మకాన్ నహీ కాని పొగరు చాలవుందని. వచ్చిరాని హిందీలో మాట్లాడటానికి అవస్థపడుతున్న మిసెస్ మూర్తిని చూసి నవ్వుకుంటూ గదిలోంచి బయటకు వచ్చింది రాధ.

చీర, జాకెట్టు పీస్‌ను, ధోవతుల చాపును సంతోషంతో గుండెల కదుముకుని గేటు దగ్గిరగా వచ్చింది రాధ. బయట గంటల తరబడి నుంచున్న ఆడవాళ్ళు తమకి చీరలు దొరకవనే భయంతోటి గేటును విరగ్గొట్టి మూక ఉమ్మడిగా లోపలికి వచ్చారు. ఆ త్రొక్కిడిలో చాలామంది స్త్రీలు క్రింద పడ్డారు. వాళ్ళమీదనుంచే మిగతావాళ్ళు లోపలికి పరుగెత్తసాగారు చీరలకోసం. స్త్రీల హాహాకారాలు, గోల, ఏడుపులు అన్నీ సర్దుమణిగే సరికి గంట పట్టింది. త్రొక్కులాటలో చనిపోయిన ఆడవాళ్ళ శవాలను పరికిస్తున్నారు. గాయపడ్డ ఆడవార్ని హాస్పిటల్స్‌కి చేరవేస్తున్నారు. నెమ్మదిగా లేచింది రాధ. అణువణువునా బాధ. గుండెల్లో విపరీతమైన నొప్పి, నోటిలోంచి రక్తం వస్తోంది. ఏదో తెలియని మైకం ఆవరిస్తోంది రాధను. తను హాస్పిటల్ పాలవకూడదు. వెళ్ళాలి. నెమ్మదిగా బయటకు వచ్చింది రాధ. తన ప్రక్కగా నుంచున్న నిండు నెలల గర్భిణీ స్త్రీ చనిపోయింది. రాధ మనసు బాధతో మూలిగింది. ఒక చీర కోసం ప్రాణాలు పోగుట్టుకున్నారు చాలామంది. దేవుడెక్కడ? ప్రశ్నించుకుంటూ తూలుకుంటూ తన గూటిని చేరుకోవడానికి తడబడుతున్న అడుగులతో నడక సాగించింది. "ఆంజనేయా! నన్ను తొందరగా చేర్పించు, నీలకి ఈచీర ఇవ్వాలి. తాతయ్యకి ధోవతుల చాపుఇవ్వాలి. దీపావళినాడు క్రొత్త బట్టలు కట్టుకుంటారు. నేను వెళ్ళాలి. ఆంజనేయా నాకు శక్తినివ్వు. వాళ్ళకిచ్చిన తరువాత నీలో ఐక్యం అయినా ఫరవాలేదు."

మర్రిచెట్టు దగ్గరకు అతి కష్టంగా చేరుకున్న రాధ అక్కడి దృశ్యం చూసి బాధతో కెవ్వున అరచింది. ఎన్నో వేల పక్షులకు ఆశ్రయమిచ్చిన



'ఉత్తమ చిత్ర కథా రచయిత్రులు ('76)గా ఆంధ్ర ప్రభుత్వం చేత నిర్ణయింపబడిన శ్రీమతి కె. రామలక్ష్మి, ('జీవనజ్యోతి') శ్రీమతి యార్లగడ్డ సరోజినీదేవి ('మావూరి గంగ') గార్లను ఇటీవల విజయవాడలో వున్న తొమ్మిది మహిళా సంస్థలు కలిసి ఘనంగా అభినందించాయి. శ్రీమతి వి. కోటీశ్వరమ్మ అభినందన సభకు అధ్యక్షతవహించగా, శ్రీమతులు యమ్. సుబ్బలక్ష్మి వి. లీలావతీ రాఘవయ్య, మోటూరు ఉదయం, హేమలతాలవణం, మల్లికాంబ, వాణీరంగారావు, వీరమాచనేని సరోజని మున్నగువారు సన్మానితులను అభినందిస్తూ ఉపన్యసించారు.

ఆ మర్రిచెట్టు. ఏనీడా దొరకని తమలాంటి పేదలకి నీడనిచ్చిన ఆ ఊడలమర్రి నేల కూలింది! కుప్పలా కూలబడిన రాధనుచూసి పరుగెత్తుకుంటూ వచ్చారు తాతయ్య, తమ్ముళ్ళు.

"అమ్మా రాధా వచ్చావా తల్లీ. మనకున్న ఈ ఆశ్రయం కూడా పోయిందే తల్లీ. మనగతి రోడ్లపాలే అయింది. ఈ ఆంజనేయులు కూడా ఏమి చెయ్యలేక పోయాడు. రాయిని పూజించానే ఇన్నాళ్ళు నాకేమి మిగిలింది మట్టి? అరే! రాధా ఏమిటమ్మా రక్తం వస్తోంది నోట్లోంచి? ఒళ్ళంతా గీరుకుని రక్తం కారుతోందీ? ఏమయిందీ? చెప్పమ్మా..." భయంగా అడుగుతున్న తాతయ్యను చూసింది రాధ.

"ఏమీలేదు తాతయ్యా నీలకి చీర తెచ్చాను. నీకు ధోవతులు తెచ్చాను. నీల ఎక్కడ?"

"నీలక్క పెద్ద కారులో ఝుమ్మని పోయింది ఎవరితోటో."

"ఏమిటీ కారులో పోయిందా? ఎక్కడికి పోయింది తాతయ్యా." గుండెను బాధతో అదుము కుంటూ అడిగింది రాధ.

"ఎవరో వర్మట–అతనితో వెళ్ళిపోయింది. ఈ ఉత్తరం నీకియ్యమంది."

"రాధక్కా.

ఈ నీడలేని మనం రోడ్లమీద పడితే మనిద్దరి బ్రతుకులు కుక్క బ్రతుకులవుతాయి. పేదరికం అనే నరకం భరించలేనక్కా. వర్మగారితో వెళ్ళి–స్వర్గం చూస్తానక్కా. ఖరీదైన చీరలు, నగలు, విందులు, వినోదాలు–మనం కలల్లో కూడా చూడలేని స్వర్గాన్ని చవిచూస్తానక్కా. నన్ను క్షమిస్తావు కదూ.

నీల."

"నీలా! నీ అందమైన శరీరాన్ని దాచడానికి ఈ చీర తెచ్చాను చెల్లీ. కాని ఆ శరీరాన్ని అమ్ము కున్నావా నీలా! స్వర్గం అని భ్రమించావు కాని; వాళ్ళు నిన్ను పువ్వులా నలిపి దుమ్ములో పడేస్తారే పిచ్చి నీలా. ఖరీదైన బ్రతుకు కోసం నీ బ్రతుకును, నీతిని, జాతిని వదులుకున్నావా నీలా! ఎందుకిలా చేసావు? ఓ భగవాన్ ఈవార్త వినకముందే నేను చనిపోయి వుంటే బాగుండేది. తాతయ్యా! తమ్ముళ్ళు జాగ్రత్త. మిమ్మల్ని వదలి వెళు తున్నాను తాతయ్యా. ఏచీకూ చింతా లేని ప్రదేశానికి పేదరికం బాధించని చోటికి—అమ్మా నాన్నల దగ్గిరకు. నన్ను క్షమిస్తావు కదూ తాతయ్యా! మిమ్మల్ని వదిలి పోతున్నందుకు....అమ్మా"

త్రొక్కిడిలో నలిగిన గుండె నీల చేసిన పని విని చితికిపోయింది. నేల కూలిన ఆ వటవృక్షం ముందే కూలి పోయింది రాధ శరీరం. అస్త మిస్తున్న సూర్యుడితోపాటు రాధ జీవితం కూడా అస్తమించింది.

సంధ్యా సమయంలో గూళ్ళను చేరుకునే పక్షులు మర్రితోపాటు కూలిపోయిన తమ గూళ్ళను, పగిలిన గుడ్లను, చనిపోయిన చిన్న పక్షి పిల్లలను చూసి అరుస్తూ ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణం చెయ్య సాగాయి. పక్షుల గోల, రాధ కోసం తమ్ముళ్ళు, తాతయ్యల ఏడుపులు ప్రతిధ్వనిస్తున్నా ఏ మాన వుడూ, ఏ దేవుడూ వినిపించుకో లేదు.

"అమ్మా రాధమ్మా! నీ శవాన్ని కప్పేటందుకు కొత్త గుడ్డ ఎలాగూ నేను తేలేనని తెలిసి, నీవే తెచ్చుకున్నావా తల్లీ ఈ చీర! పోన్లేమ్మా నీవు బ్రతికుండగా నీ శరీరాన్ని దాచుకునేందుకు ఎవరూ చింకి చీరయినా ఇవ్వలేకపోయారు, నీవు చనిపోయే ముందు నీ శవాన్ని కప్పేటందుకు క్రొత్త చీర ఇచ్చారు! సంతోషం తల్లీ. నీవు బ్రతికుండగా తింటానికి ఎండిన రొట్టె దొరకలేదు. చింకిపాతలు కట్టుకున్నావు. పూరిగుడిసెలోను మర్రి నీడను బ్రతికావు. రాధమ్మా! చనిపోయి స్వర్గాన్ని చేరు కున్నావు తల్లీ. అక్కడే దేవతలతోపాటు చీని చీనాంబారాలు కట్టుకో, అమృతం తాగు, పుష్పక విమానంలో తిరుగు. అక్కడ సుఖపడు తల్లీ." తాతయ్య వాగ్ధోరణిని ఎవరూ ఆపలేరు.

రాధ అంతిమ యాత్రకు పేదవాళ్ళు సహాయ పడ్డారు. కంట్రాక్టర్ విష్ణుమూర్తి తెలియకుండానే రెండు కన్నీటిబొట్లు రాల్చాడు. పోయింది పీడ అనుకుంది మూర్తి ధర్మపత్ని. వర్మ మేడలో పట్టుచీర కట్టుకుని, నగలు పెట్టుకుని అందంగా అలంకరించుకున్న నీల-నిలువుటద్దంలో తన అంద మైన ప్రతిబింబం చూసుకుంటే బలిపీఠానికి పోయే బలిపశువు గుర్తుకొచ్చింది. కుడి కన్ను అదర సాగింది.

మరునాడు పేపర్లో పడ్డ వార్త ఇది.

"మహిళా సంవత్సరం సందర్భంగా మహిళా మండలి వారు పేద మహిళలకిచ్చే చీరల కోసం జరిగిన త్రొక్కిడిలో మరణించిన మహిళల సంఖ్య ముప్పై. గాయపడ్డవారి సంఖ్య రెండువందలు."

ఆ సాయంత్రం మహిళా మండలి వారు తమ విలువైన జరీ చీరలను సవరించుకుంటూ మర ణించిన మహిళల కోసం సంతాప సభ జరిపారు.

తింటానికి ఏమీ దొరకక, వుంటానికి స్థలం లేక కాలే కడుపులతో, చిరుగుల పాతలతో రోడ్ల మీద పడి తిరుగుతున్నారు తాతా మనుమళ్ళు. రోడ్ల ప్రక్కగా గోడలమీద, బోర్డ్లమీద అంటించిన రంగు రంగుల సినిమా వాల్‌పోస్టర్స్‌ను చూస్తు న్నాడు గోపి.

"తాతయ్యా! "రోటీ, కపడా ఔర్ మకాన్" అంటే ఏమిటి తాతయ్యా?"

"మనలాంటి పేదవాళ్ళకి భగవంతుడు ఇవ్వడం మర్చిపోయిన మూడు వరాలు రా." రాధ, నీలలు జ్ఞాపకం వచ్చి కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు తాతయ్య.

ఈ మూడు కోసం ఆత్మను చంపుకోలేక శరీరాన్ని మట్టికర్పించింది రాధ. ఈ మూడు కోసం ఆత్మను చంపుకుని శరీరాన్ని అమ్ము కుంది నీల.

"మరి వీటికోసం మేము ఏమిచెయ్యాలి?" జవాబు దొరకని ప్రశ్నగా మిగిలింది తాతయ్య మనసులో. □



విశాఖపట్నం శారదా మహిళా సమాజం (కంచెర పాలెం శాఖ) ఇటీవల ద్వితీయ వార్షికోత్సవాన్ని జరుపుకున్నది. అదే రోజున బాలల దినోత్సవం కూడా జరిగింది. విశాఖపట్నం పోర్ట్ ఛైర్మన్ శ్రీ బి. కె. రావు ముఖ్య అతిధిగా వచ్చారు. శ్రీమతి సీతా బి. కె. రావు – నూతన భవనాన్ని తెరిచారు. మహిళా సమాజం కార్యదర్శిని శ్రీమతి కళా రామకృష్ణ నివేదిక చదివారు. ఈ సమాజం నడుపుతున్న 'డాన్స్ స్కూలు' గురించి, నిర్వ హిస్తున్న సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల గురించీ–ఆమె తెలియజేశారు. ఉత్సవంలో పాల్గొని, గెలుపొందిన బాల బాలికలకు శ్రీమతి బి. కె. రావు బహుమతులు అందజేశారు. బాలబాలికల నృత్య నాటికలతో, ఉత్సవం అంతమైంది.